క్లుప్తంగా

కొయ్యల ఏమాజీకి సన్మానం

మంచిర్యాలటౌన్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన కొయ్యల ఏమాజీ శుక్రవారం మంచిర్యాలకు రాగా, పార్టీ నాయకులు సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో బెల్లంపల్లి అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందాలని ఆకాంక్షించారు. పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముల్కల మల్లారెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు గోలి రామన్న, జిల్లా ఉపాధ్యక్షులు అశోక్ వర్ధన్, పులగం తిరుపతి, మాజీ జిల్లా అధ్యక్షుడు మున్నారాజా సిసోడియా, మాజీ కార్యదర్శి మల్లేశ్, జిల్లా అధికార ప్రతినిధి తుల మధుసూదన్, పట్టణ ఉపాధ్యక్షుడు ప్రదీప్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

చెన్నూర్: పట్టణంలోని సురక్ష హాస్పిటల్‌లో మంచిర్యాల శ్రీహర్ష ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన వివిధ గ్రామాల నుంచి 200 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు దుర్గ వినోద్, గౌతమ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కాసిపేట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరితహారం కార్యక్రమంపై అటవీశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని మోడల్‌స్కూల్‌లో జరిగిన ఈ పోటీల్లో ముత్యంపల్లి, కాసిపేట జెడ్పీ, కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈనెల19న నిర్వహించే హరితహారం కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందిస్తామని డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ నాయక్ తెలిపారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగమల్లయ్య, జెడ్పీ పాఠశాల హెచ్ఎం రాథోడ్ రమేశ్, ఉపాధ్యాయులు గణేశ్, వేణు తదితరులు ఉన్నారు.

ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలి

చెన్నూర్‌రూరల్: పేదలకు ఇళ్ల స్థలాల కోసం పట్టాలివ్వాలని, ఇంటిని నిర్మించుకునేందుకు రూ.10 లక్షలు అందించాలని తెలంగాణ అవాజ్ కమిటీ రాష్ట్ర నాయకుడు అక్మాల్ పాషా అన్నారు. మండలంలోని బావురావుపేట సమీపంలో ఇళ్ల స్థలాల పోరాటం 48వ రోజు చేరుకోగా శుక్రవారం ఆయన వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మైనార్టీలకు ముస్లిం బంధు అమలు చేయాలన్నారు. వెనుకబడిన వారి కోసం నిధిని ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. మైనారిటీ పేదలకు డబుల్ బెడ్రూంలు ఇవ్వాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యుడు బోడంకి చందు, డీవైఆఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, నాయకులు ఎండీ అవేజ్, చంద్రన్న, అనిల్, అవాజ్ నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

భీమిని: కన్నెపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్యనారాయణ, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా, తహసీల్దార్ రాంచందర్, వైస్ ఎంపీపీ రాకేశ్‌శర్మ, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ శ్రీరామరావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆకుతోట రాజన్న, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటింటి సర్వే

జన్నారం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 17 నుంచి ఇంటింటికీ సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఇట్యాల కిషన్ శుక్రవారం తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఓటు హక్కు లేని వారిని నమోదు చేయించడం, రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నవారిని గుర్తించడం, ఓటరు లిస్టులో పేరు ఉండి ప్రస్తుతం ఊర్లో లేని వారి వివరాలు సేకరించనున్నట్లు పేర్కొన్నారు. సర్వే సిబ్బందికి గ్రామాల్లోని ప్రజలు సహకరించాలని కోరారు.

సామూహిక అక్షరాభ్యాసం

తాండూర్: మండలంలోని బోయపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రవేశం పొందిన పిల్లలకు శుక్రవారం అక్షరాభ్యాసం జరిగింది. ఐసీడీఎస్ నుంచి 10 మంది విద్యార్థులు చేరగా, వారితో సామూహిక అక్షరభ్యాసం చేయించారు. హెచ్ఎం మధుసూదన్, ఉపాధ్యాయులు సుధ, పరిమళ, లత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మమత, కార్యకర్తలు పూలవతి, భాగ్యలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

శ్రీరాంపూర్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్రం ఆదేశాలతోనే సింగరేణి వ్యాప్తంగా ఈనెల 16 నుంచి 30 వరకు నిర్వహించే 'స్వచ్ఛత పక్వాడ'ను విజయవంతం చేయాలని కోరారు. పని చేసే చోట, నివాసాల చుట్టూ చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏజెంట్ ఏవి రెడ్డి, డీజీఎం చిరంజీవి, సీనియర్ పీవో కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేగేటుతో తప్పని తిప్పలు

- ఏడేళ్లుగా పూర్తి కాని వంతెన నిర్మాణం
- రైల్వేగేటు వద్ద గంటల తరబడి నిరీక్షణ
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



అసంపూర్తిగా రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు



గేటు పడటంతో నిలిచిన వాహనాలు

సిర్పూర్(టి): ఏడేళ్లు గడుస్తున్నా రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రధాన రహదారి గుండా ప్రయాణాలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి 2016వ సంవత్సరంలో టెండర్లు పూర్తయి నిర్మాణ పనులు ప్రారంభం కాగా ఇప్పటి వరకు పూర్తికాలేదు. దీంతో నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సిర్పూర్(టి) మండలం పెద్దబండ -వేంపల్లి గ్రామాల మధ్యలోని సిర్పూర్(టి) -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలో ఉన్న రైల్వేగేటుతో వాహనదారులకు, ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. కొన్నేళ్లుగా రైల్వేగేటు వద్ద గేటు పడితే వాహనదారులు, ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ప్రతినిత్యం రద్దీగా కొనసాగే సిర్పూర్(టి) -కాగజ్‌నగర్ ప్రధాన రహదారి గుండా సిర్పూర్(టి), కాగజ్‌నగర్, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లోని గ్రామాల ప్రజలతో పాటు సమీపంలో మహారాష్ట్ర పట్టణాలు రాజూరా, బల్లార్షా, గోండ్‌పిప్రి, చంద్రపూర్, అహెరీ, ఆలపెల్లి, ఇతర గ్రామాల ప్రయాణికులు ప్రయాణాలు సాగిస్తుంటారు. రైల్వేగేటు వద్ద గేటు పడుతుండడంతో అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు సైతం సకాలంలో రోగులను ఆసుపత్రులకు చేర్చలేకపోతున్నాయి. గతంలో రైల్వేగేటు పడడంతో అంబులెన్స్‌ల్లోని రోగులు తీవ్ర అవస్థలకు గురైన సందర్భాలు అనేకం ఉన్నాయి. రైల్వే గేటు వద్ద గంటల తరబడి నిరీక్షించలేక కొందరు ద్విచక్ర వాహనదారులు ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. గేటు పడిన సమయంలో వేచి ఉండకుండా గేటు కింద నుంచి దాటుతున్నారు. రైల్వే అధికారులు వారిస్తున్నప్పటికీ వాహనదారులు పట్టించుకోవడం లేదు. కాగా పలుమార్లు సాంకేతిక లోపాలతో రైల్వేగేటు పూర్తిగా నిలిచిపోతుండటంతో వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. సాంకేతిక లోపం వచ్చినప్పుడు రైల్వే అధికారులు వచ్చి మరమ్మతులు చేపట్టే వరకు వాహనాలు కదలలేని పరిస్థితి నెలకొంటుంది.

నత్తనడకన వంతెన నిర్మాణ పనులు

పెద్దబండ -వేంపల్లి గ్రామాల మధ్యలో గల రైల్వే గేటు వద్ద రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి 2016లో రూ.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరై ఎనిమిదేళ్లు గడుస్తున్నా పనులు మాత్రం పూర్తి కావడం లేదు. ప్రారంభంలో అటవీశాఖ అనుమతులు లేక ఒక ఏడాది వంతెన నిర్మాణ పనులు నిలిపివేశారు. అనంతరం అటవీశాఖ అనుమతులతో పనులు ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు పూర్తి చేయలేదు. రైల్వేగేటు వద్ద ఇరువైపులా వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ రైల్వేలైనుపై వేయాల్సిన వంతెన నిర్మాణానికి అనుమతులు లేవంటూ అటవీశాఖ అధికారులు నిలిపివేశారు. దీంతో వంతెన పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. నిబంధనల మేరకు రెండేళ్లలో వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉండగా అనుమతుల పేరుతో వర్క్ ఎక్స్‌టెన్షన్ పేరుతో గడువు పెంచుకుంటూ పోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి వాహనదారులకు రవాణ సౌకర్యం కల్పించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రతీరోజు తప్పని నిరీక్షణ..



ప్రతీరోజు రాకపోకలు కొనసాగించే వాహనదారులు పెద్దబండ -వేంపల్లి గ్రామాల మధ్యలో గల రైల్వే గేటు వద్ద గేటు పడితే నిరీక్షించాల్సిందే. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు సైతం నిలిచిపోతుండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వంతెన నిర్మాణ పనులు పూర్తిచేస్తే ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోతాయి.

\- బోర్కుటే గణేశ్, సిర్పూర్(టి)

అధికారులు చొరవ చూపాలి



రైల్వేగేటు వద్ద ప్రభుత్వం మంజూరు చేసిన రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా వంతెన నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. ఈ రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని వంతెన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలి.

\- దుర్గం రాజ్‌కుమార్, వాహనదారుడు

కొండెక్కిన 'కోడిగుడ్డు'..!

- పెరిగిన ధరలు
- ఒక్కో గుడ్డు రూ.7కు అమ్మకం
- మధ్య తరగతి ప్రజల ఇక్కట్లు



కోడి గుడ్లు

కౌటాల: మధ్య తరగతి ప్రజల పౌష్టికాహారం కోడి గుడ్డు ధరలకు రెక్కలొచ్చాయి. వీటి ధరలు ఒక్కసారిగా పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు నిత్యావసరాల ధరలు మండిపోతుండగా.. మరోవైపు చికెన్, మటన్, చేపల ధరలు పెరుగుతున్నాయి. దీనికితోడు సామాన్యులకు అందుబాటులో ఉండే గుడ్డు ధర కూడా అమాంతంగా పెరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

గుడ్డుతో పౌష్టికాహారం

ఆరోగ్యంగా ఉండాలంటే బలవర్ధకమైన పౌష్టికాహారం తినాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో గుడ్ల ధరలు పెరిగినా ప్రజలు గుడ్లను ఎక్కువస్థాయిలో కొనుగోలు చేస్తున్నారు. ఇది కూడా గుడ్ల ధరలు పెరగడానికి ఒక కారణంగా భావిస్తున్నారు. ఇమ్యూనిటీని పెంచుకోవడం కోసం ఎన్నడూ లేని విధంగా ప్రజలు ప్రస్తుతం గుడ్లను ఎక్కువగా కొనుగోలు చేస్తుండడం విశేషం. జిల్లాలో కోడిగుడ్ల ఉత్పత్తి అంతంతా మాత్రంగానే ఉండడంతో ఇతర జిల్లాల నుంచి కోడిగుడ్లను వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. ఐదేళ్ల నుంచి పౌల్ట్రీఫాం రైతులు నష్టాలు చవిచూడడం, కోడి పిల్లల పెంపకాన్ని తగ్గించడంతో గుడ్ల ధరల పెరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

పెరిగిన ధరలు

కోడిగుడ్ల వినియోగంతో పాటు మన రాష్ట్రంలో పండించిన ధాన కోళ్లకు సరిపోకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి అధిక ధర చెల్లించి ధాన దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో కోడిగుడ్ల ధరలు పెరుగుతూ వస్తున్నాయి. గత ఏప్రిల్‌లో సరాసరి ఒక గుడ్డు ధర రూ.4 నుంచి రూ. 4.50లు ఉండగా ప్రస్తుతం రిటైల్‌గా రూ.6.50 వరకు ఉంది. హోల్‌సేల్ వ్యాపారులు మార్కెట్ ధర ప్రకారం గుడ్లు సరఫరా చేస్తున్నప్పటికీ రిటైల్ వ్యాపారులు మాత్రం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కోడిగుడ్ల వినియోగానికి డిమాండ్ పెరగడంతో మారుమూల గ్రామాలు, రవాణా సౌకర్యం అంతగా లేని గ్రామాల్లో గుడ్డును రూ.7 వరకు విక్రయిస్తున్నట్లుగా తెలుస్తోంది. హోల్‌సేల్‌గా డజన్ కోడిగుడ్లు రూ.66– రూ.68కి లభిస్తున్నాయి. కిరాణాషాపుల్లో డజన్ కోడిగుడ్లు రూ.78కు విక్రయిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. ఒకవైపు పెరుగుతున్న కూరగాయల ధరలు మరోవైపు గతంలో ఎన్నడూ లేనంతగా కోడి గుడ్లు ధర పెరగడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు సుమారు 50వేల గుడ్ల వినియోగం ఉందని అధికారులు చెబుతున్నారు.

ధరల నియంత్రణేది..?

కోడిగుడ్ల ధరలతో పాటు చికెన్ ధర సైతం మండిపోతుంది. కిలో చికెన్‌ను రూ.300 వరకు విక్రయిస్తున్నారు. దీంతో పాటు అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలు నియంత్రణ లేకుండా పెరుగుతున్నాయి. కోడిగుడ్ల ధరల పెరుగుదల నియంత్రణలో అధికార యంత్రాంగం విఫలమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కోడిగుడ్ల ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు



ఒగ్గు కళాకారుల నృత్యం

దహెగాం: మండలంలోని గిరవెల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పోచమ్మ, భూలక్ష్మి, మహాలక్ష్మి విగ్రహాల ప్రతిష్ఠాపన శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం విగ్రహాల ప్రతిష్ఠాపన చేయగా సాయంత్రం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించారు. ఒగ్గు కళాకారుల వాయిద్యం, శివసత్తుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్సైలకు పదోన్నతులు

ఆసిఫాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఎస్సైలకు పదోన్నతులు కల్పిస్తూ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, హైదరాబాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు ఎస్సైలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లుగా పదోన్నతులు పొందారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రమేశ్, నిర్మల్‌లో విధులు నిర్వహిస్తున్న ఎల్. వెంకటరమణలకు పదోన్నతులు లభించాయి.

25న సీఆర్‌టీ పోస్టులకు పరీక్ష

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్‌టీలుగా పని చేసేందుకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 25వ తేదీన పరీక్ష ఉంటుందని గిరిజన సంక్షేమశాఖ అధికారి మణెమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు 21, 22వ తేదీల్లో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో హాల్‌టికెట్లను పొందవచ్చన్నారు.

అర్హులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రియాజ్ అలీ

సిర్పూర్(టి): అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రియాజ్ అలీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండేలా చూడాలని, ఓటరు నమోదులో మార్పులుచేర్పులు ఉంటే చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించి ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని బీఎల్‌వోలు పాల్గొన్నారు.

'గిరిజన సంబురాలకు హాజరు కావాలి'

కెరమెరి: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించే గిరిజన సంబరాలకు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ ఊట్నూర్ ఆధ్వర్యంలో హెచ్‌కే జీఎస్ గార్డెన్‌లో నిర్వహించే గిరిజన సంబరాలకు ఐటీడీఏ నుంచి లబ్ధిపొందిన వారు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

నీలగిరి, సుబాబుల్ తోటల పెంపకంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్పీఎం ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని బూరుగుడా రైతువేదికలో శుక్రవారం కాగజ్‌నగర్ ఎస్పీఎం కంపెనీ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు కృష్ణారెడ్డి, ఖాదర్ హుస్సేన్‌లు రైతులకు నీలగిరి, సుబాబుల్ తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఒక్కసారి ఈ మొక్కలు నాటితే మూడు సంవత్సరాలకు ఒక్కసారి కటింగ్ చేసుకోవచ్చన్నారు. దీంతో రైతులకు ఒక ఎకరం పొలంలో మూడు సంవత్సరాలకు రూ.1.50 లక్షల ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. తోటల ద్వారా రైతులు తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభం పొందవచ్చని తెలిపారు. ఈ తోటల్లో రైతులు అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎస్పీఎం కంపెనీ నర్సరీ నుంచి రైతులకు రాయితీపై మొక్కలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో ఇనాం, కంపెనీ ప్రతినిధులు కోటేష్, శ్రీధర్, సంతోష్, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కాగజ్‌నగర్‌టౌన్ ఏఈ కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల నెలవారి మరమ్మతుల కారణంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జొన్న కొనుగోళ్లు నిలిపివేత

తాంసి: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో చేపట్టిన జొన్నల కొనుగోళ్లను తాత్కాలికంగా రెండు రోజులు 17, 18తేదీల్లో నిలిపివేస్తున్నట్లు సొసైటీ సీఈవో కేశవ్ తెలిపారు.

బండి సంజయ్ సభ విజయవంతం చేయాలి

మంచిర్యాలటౌన్: ప్రధానిగా మోదీ తన 9 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ ఆధ్వర్యాన మహాజన సంపర్క అభియాన్‌లో భాగంగా మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో ఈనెల 21న జరిగే రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు. జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మే 30 నుంచి జూన్ 30వ తేదీ వరకు మహాజన సంపర్క అభియాన్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. మంచిర్యాల నుంచి చలో లక్సెట్టిపేట్ భారీ బహిరంగ సభకు 2 వేల మంది కార్యకర్తలు, అభిమానులను తరలించేందుకు మంచిర్యాల పట్టణ 26 శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు కృషి చేయాలన్నారు. పట్టణ కార్యదర్శులు బోయిని హరికృష్ణ, గాజుల ప్రభాకర్, ప్రోగ్రాం ఇన్‌చార్జి పానగంటి మధు, పట్టణ ఇన్‌చార్జి ఆరుముల్ల పోషం, అసెంబ్లీ కన్వీనర్ మల్లికార్జున్, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, సంతోశ్ పాల్గొన్నారు.

స్వచ్ఛత పక్వాడాపై అవగాహన

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో శనివారం ఈనెల 30 వరకు స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం నిర్వహించనున్నట్లు జీఎం మోహన్‌రెడ్డి తెలిపారు. ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలో శుక్రవారం స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఏరియాలో పచ్చదనం, పరిశుభ్రత, పలుచోట్ల మొక్కలు నాటడం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని వేంపల్లి, రాపల్లి, బుద్దిపల్లి గ్రామాల్లో డీఎంఎఫ్‌టీ నిధుల కింద చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దివాకర్‌రావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. వేంపల్లిలో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన అనంతరం రూ.20 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న కల్వర్టు పనులకు భూమి పూజ చేశారు. రూ. 30 లక్షలతో రాపల్లిలో, బుద్దిపల్లిలో రూ. 5 లక్షలతో కల్వర్టుల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సర్పంచులు శారద, మల్లేశ్, మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ స్వర్ణలత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, జెడ్పీ కోఆప్షన్ నహీంపాషా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జీవన్‌రావు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యం



భూమిపూజ చేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు

కాగజ్‌నగర్‌రూరల్: గ్రామాలు అభివృద్ధి చెందడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. ఐటీడీఏ నుంచి రూ. 21లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కోసం నూతన గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. అనుకోడ, బసంతినగర్, బుర్దగూడ, దుర్గానగర్, జగన్నాథ్‌పూర్, కడంబా, రేగులగూడ, లైనుగూడ, మాలిని గ్రామపంచాయతీలకు కూడా నూతన భవనాలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, సర్పంచ్ టేకం భీంబాయి, నాయకులు మౌల్కార్ లక్ష్మణ్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు న్యాయం



కొండపల్లిలో మాట్లాడుతున్న రావి శ్రీనివాస్

పెంచికల్‌పేట్: కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు, రైతులకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రావి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా శుక్రవారం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ పార్టీ విఫలమైందని విమర్శించారు. హరితహారం పేరుతో రైతులు సాగు చేసుకుంటున్న భూములను ఫారెస్టు అధికారులు లాక్కొని రైతుల పొట్టగొడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పోడు భూములకు పట్టాలు, రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ వైఫల్యాలను ఎండగడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోతెపల్లి సర్పంచ్ దాసరి చంద్రమౌళి, పార్టీ మండల అధ్యక్షుడు బోయిరే బండు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు బయోమెట్రిక్ వేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో సుధాకర్

కెరమెరి: ఉపాధ్యాయులందరు ప్రతీరోజు నియమిత వేళల్లో బయోమెట్రిక్‌లో హాజరు వేయాలని మండల విద్యాధికారి కె.సుధాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా మంది టీచర్లు బడిబాటలోని విద్యార్థుల వివరాలను ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయడం లేదన్నారు. చాలాసార్లు చెప్పినప్పటికీ హెచ్ఎంలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. బడులు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్న నేపథ్యంలో అధిక మంది విద్యార్థులను బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, గోయగాం కాంప్లెక్స్ హెచ్ఎం నల్గొండ రమేశ్ ఉన్నారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



విత్తన ప్యాకెట్లు పరిశీలిస్తున్న ఏవో

కెరమెరి: విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి ఎన్.గోపీకాంత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వివిధ సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ దుకాణాలతో పాటు సుల్తాన్‌గూడ ఆగ్రో రైతు విక్రయ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అక్కడున్న విత్తనాల శాంపిల్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ధరలకే విత్తనాలను విక్రయించాలన్నారు. విత్తనాల కొరత ఉందని, తర్వాత విత్తనాలు లభించవంటూ మాటలు చెప్పి రైతులను మోసం చేయవద్దన్నారు. ధరల పట్టికను తయారు చేసుకొని రైతులకు కనిపించేలా డిస్‌ప్లే చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేశాక రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఏఈవో వెంకటేశ్ ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా:
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.పాయింకుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899